క్లుప్తంగా

నేటి నుంచి మంచినీటి సరఫరా పునరుద్ధరణ

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: రక్షిత మంచినీటి సరఫరాను శుక్రవారం ఉదయం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఉండవల్లి, తెనాలి పట్టణంలో జరుగుతున్న రక్షిత మంచినీటి పైపులైన్ మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సాయంత్రం లోపు పనులు పూర్తయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈలు సుబ్బారావు, నాగభూషణం, పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

మెడికల్ క్యాంప్‌లతో ఆరోగ్య భరోసా



తెనాలిఅర్బన్: ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లు పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నాయని అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీజాన్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో గురువారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గైనిక్ ఓపీ 14, జనరల్ ఓపీ 171, ఆర్థోపెడిక్ 51, ఆప్తామాలజీ 45 మందికి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. మెడికల్ క్యాంప్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, డాక్టర్ వినోద్‌బాబు, డాక్టర్ మధుకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగలక్ష్మి



తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి పట్టణ క్లస్టర్-2 మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమితులైన రావులపల్లి నాగలక్ష్మి గురువారం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. క్లస్టర్-2లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో పార్టీకి మహిళల మద్దతును కూడగట్టేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ సూచించగా, తన సాయశక్తులా కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

ఓటుహక్కు ప్రాధాన్యంపై అవగాహన



గరికపాడు(కాకుమాను): ఓటు హక్కు ఎంతో విలువైనదని, అలాంటి విలువైన ఓటు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ పార్వతి అన్నారు. మండలంలోని గరికపాడులో గురువారం ఓటర్లను చైతన్య పరచడం, వారిని భాగస్వాములు చేయడం కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధంలాటిందని, అలాంటి ఎంతో విలువైన ఓటు గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆయన సూచించారు. మద్యం, నగదు, ఇతర ప్రలోభాలకు గురికాకుండా ప్రతి ఒక్కరు తమ పవిత్రమైన ఓటును వినియోగించుకోవాలని అప్పుడే ప్రతి ఒక్కరు సంతోషంగా ఉంటారని ఆమె తెలిపారు. ఓటుతోనే దేశ ప్రగతి ఉందన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని ఆమె కోరారు. ఈసందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యత గురించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీలర్లు ఎన్నికల నియమావళి పాటించాలి

ఫిరంగిపురం: మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ జి.రాఘవేంద్రరావు అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రచారాలు, పార్టీనాయకులతో కలిసి తిరగడం వంటివి చేయకూడదని చెప్పారు. అలా చేసినట్లయితే ఎన్నికల నిబంధనల ప్రకారం వారిని తొలగిస్తామన్నారు. సమావేశంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడుతో సర్కారు బడికి జీవం

- తెనాలి పరిధిలో అభివృద్ధి చెందిన 84 పాఠశాలలు
- మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.28 కోట్లు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో ప్రవేశపెట్టిన నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వం రెండు విడతలలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా తెనాలి పరిధిలోని 84 పాఠశాలలను అభివృద్ధి చేసింది. దీంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు మారాయనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

తెనాలి పట్టణం, మండల పరిధిలో 97 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో మౌలిక వసతుల కల్పనతో పాటు కార్పొరేట్ స్థాయిలో అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ప్రవేశపెట్టారు. మొదటి విడత కింద తెనాలి పట్టణం, మండల పరిధిలో 45 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం, రక్షిత మంచినీటి ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, కాంపౌండ్ వాల్స్, ఎలక్ట్రికల్ వర్క్, గ్రీన్ చాక్ బోర్డు, ఫర్నీచర్, పెయింటిగ్స్, మేజర్, మైనర్ రిపేర్లు చేశారు. రెండవ విడత కింద మరో 39 పాఠశాలలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. పనులు 90 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం పనులు జరుగుతున్నాయి.



కేఎస్ఎం స్కూల్‌లో నాడు-నేడు రెండో విడతలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు



నందివెలుగు ఎంపీపీ స్కూల్‌లో నిర్మించిన ఆధునిక టాయిలెట్స్



ఎలిమెంటరీ స్కూల్లో ఏర్పాటు చేసిన బెంచీలు

నాడు-నేడు కింద రూ.28 కోట్ల నిధులు కేటాయింపు..

నాడు-నేడు పథకం కింద మొదటి విడత ఎంపికైన 45 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం రూ.10.14 కోట్ల నిధులు వెచ్చించింది. అలాగే రెండవ విడత ఎంపిక చేసిన 39 పాఠశాలలకు రూ.17.08 కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి చేసింది. అంటే రెండు విడతలలో ఎంపిక చేసిన 84 పాఠశాలల్లో సుమారు రూ.28 కోట్ల నిధులు ప్రభుత్వం వెచ్చించినట్లు అయ్యింది.

చివరి దశకు వచ్చిన రెండవ విడత పనులు..

నాడు-నేడు కింద రెండవ విడత 39 పాఠశాలల్లో చేపట్టిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వాటిలో ఇప్పటి వరకు సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పెయింట్స్, కిటికీలు, బెంచీలు, గ్రీన్‌బోర్డు, ఫ్యాన్‌లు వంటివి మాత్రమే ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన జరగటంతో విద్యార్థులు కూడా అక్కడ చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మొత్తం మీద నాడు-నేడు పథకం ప్రభుత్వ పాఠశాలలకు జీవం పోసిందనటంలో ఎటువంటి సందేహం లేదు.

ఇబ్బందులు తొలగాయి..



ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక గతంలో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మాకు సరైన టాయిలెట్స్ ఉండేవి కావు. ఉన్న గదులలో ఎక్కువ మంది విద్యార్థులు కూర్చోవాల్సి వచ్చేది. అలాగే మంచినీటి సదుపాయం కూడా సరిగా ఉండేది కాదు. కానీ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో కావాల్సిన వసతులు సీఎం జగన్ కల్పించారు. ఆయన కృషి వలన ఇబ్బందులు తొలగిపోయాయి.

– ధరావత్ మోక్షిత సాయి, 8వ తరగతి, కేఎస్ఎంహెచ్ స్కూల్, తెనాలి

కార్పొరేట్ స్థాయిలో పాఠశాలను తీర్చిదిద్దారు..



గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు ఉండవనే ఆరోపణ ఉండేది. సీఎంగా జగన్ వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మంచినీరు, ఫ్యాన్‌లు, లైట్‌లు, ఆధునిక టాయిలెట్‌లు వంటి వాటిని ఏర్పాటు చేశారు. దీంతో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు మార్పు చెందాయి.

–దగ్గుమల్లి అనిల్‌రాజు, 8వ తరగతి, కేఎస్ఎంహెచ్ స్కూల్, తెనాలి

నాడు-నేడు పథకం ఒక వరం..



ప్రభుత్వ పాఠశాలలకు నాడు-నేడు పథకం ఒక వరంగా చెప్పవచ్చు. గతంలో ఇరుకు గదులలో చదువుకోవాల్సి వచ్చేది. అలాగే మధ్యాహ్న భోజనం కూడా బాగుండేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాడు-నేడు పథకం ద్వారా మౌలిక వసతుల కల్పన చేసేంది. అంతేకాకుండా విద్యార్థులకు అవసరమైన బుక్స్, ట్యాబ్‌లు, యూనిఫాం, షూస్ వంటి వాటిని ఇవ్వటంతో పాటు అమ్మ ఒడి ద్వారా నగదును కూడా ఇచ్చింది.

–పినపాటి కీర్తన, 10వ తరగతి, జెడ్పీ హైస్కూల్, కొలకలూరు, తెనాలి మండలం

చిన్నచూపు తొలగింది..



గతంలో పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నామంటే చిన్నచూపుగా చూసేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. ధైర్యంగా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్నామని చెప్పగలగుతున్నాం. అంతేకాకుండా నాడు-నేడు కింద ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ రుణం మాలాంటి పేదలు ఎప్పటికీ తీర్చుకోలేరు.

–ఎం.రాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, ఎస్ఎస్ఎస్ ఎంహెచ్ స్కూల్, తెనాలి

ఓటు హక్కును వినియోగించుకోండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: ఓటు హక్కును అందరూ వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అవేర్నెస్ గ్రూప్ సభ్యులు ఇంటింటి సర్వేను గురువారం నిర్వహించారు. సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం తెనాలి పట్టణానికి చెందిన 105 సంవత్సరాల వృద్ధురాలు పోచరాజు మారుతీని ఆమె నివాసంలో మున్సిపల్ అధికారులు కలిశారు. మే 13న జరిగే ఎన్నికల్లో కూడా ఓటును వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, కాకి వికాస్, పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గోపాత్రుడు నవలపై చర్చావేదిక

తెనాలి: పత్రికా సంపాదకురాలు ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో నెలనెలా ఏర్పాటు చేస్తున్న చర్చావేదికను ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నారు. ఆరోజు సాయంత్రం ఆరు గంటలకు కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటయ్యే సభలో సుప్రసిద్ధ రచయిత, పాత్రికేయుడు కేఎన్వై పతంజలి నవల 'గోపాత్రుడు'పై చర్చ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య, 'చినుకు' సంపాదకుడు నండూరి రాజగోపాల్ ప్రధాన వక్తలుగా వివరించారు.

సంక్షేమం అందించాం.. ఆశీర్వదించండి

నందివెలుగు గ్రామస్తులతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: గ్రామంలో ప్రతి గడపకు తిరిగాను.. ప్రతి ఇంట్లో సంక్షేమం అందించాం.. రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించండి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. గ్రామంలో పార్టీ నాయకులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. రూరల్ మండలం నందివెలుగులో కల్యాణ మండపంలో గురువారం గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పార్టీ సీనియర్ నాయకులు బొంతు నరేంద్రరెడ్డి స్వాగతం పలికారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఏడాదిన్నరపాటు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తిరగాను సమస్యలు తెలుసుకున్నాను. సాధ్యమైనంత వరకు పరిష్కరించాం. పని చేశాం కాబట్టి మళ్లీ ఓటు అడుగుతున్నామన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు ఓటు అడిగే హక్కును కోల్పోయారన్నారు. తెనాలికి మనోహర్ ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నందివెలుగులో పార్టీ పరిస్థితి బాగుందని, నాయకులంతా కష్టపడి పనిచేయాలని, మంచి మెజార్టీ వస్తుందన్నారు. గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం, సచివాలయాల ఏర్పాటు, డ్రైనేజిలు లాంటి అభివృద్ధి పనులు చేశామన్నారు. కులమతాలకు సంబంధం లేకుండా ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం ఉందన్నారు. చిత్తశుద్ధితో పనిచేశామని, నాకన్నా ఎక్కువగా ఎవరైనా పనిచేస్తే ఓపెన్‌గా చర్చకు రావచ్చన్నారు. రాబోయే ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను, ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించి, ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, గ్రామ పార్టీ కన్వీనర్ కానుగోలు సురేష్, నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, తోటకూర వెంకట వసంతరావు, వేముల మహేష్, తోటకూర సుబ్రమణ్యం, మంగా శివనాగేశ్వరరావు, కసుకుర్తి దానియేలు, బెజ్జం బాజి, చీదర్ల శాంతిరాజు, కమాదుల స్వామి, తన్నీరు వెంకటేశ్వరరావు, సోమరాజు విజయలక్ష్మి, నవనీతం నాగేశ్వరరావు, గొర్రై వెంకటేశ్వరరావు, డి.ప్రసాద్, బాలగోపి, షేక్ చిన గాలీషా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే సహించేది లేదు

తెనాలిరూరల్: గ్రామాల్లో అలజడులు రేపితే సహించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. తెనాలి రూరల్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు గురువారం మండలంలోని జాకీర్‌హుస్సేన్‌నగర్, హాఫ్‌పేట, ఖాజీపేట, ఎరుకలపూడి గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించి కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నటుట్ తెలిపారు.



రూట్ మార్చ్‌లో ఎస్ఐ కోటేశ్వరరావు, కేంద్ర బలగాలు

సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తెనాలిటౌన్: తెనాలి డివిజన్ పరిధిలో గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను సెలవు రోజుల్లో కూడా చెల్లించవచ్చని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వి.చీరంజీవి తెలిపారు. శుక్ర, ఆదివారాల్లో విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కఠెవరంలో నాల్గవ రోజు ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం గురువారం నాల్గవ రోజు జరిగింది. పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారానికి విశేష స్పందన లభించింది. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీటీసీ సభ్యులు మైలా భాను ప్రసాద్, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంకురు బుజ్జిబాబు, గ్రామ ఉప సర్పంచ్ షేక్ బాబు సాహెబ్, పార్టీ గ్రామ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు బొనిగల సునీత, కొత్తపల్లి సుదర్శన్, ముక్కాల మహేష్, పార్టీ నాయకులు మంచాల శ్రీనివాసరావు, ఎల్.చిన్నిబాబు, బొనిగల సురేష్, షేక్ ఆదాం షఫీ, తుల్లిమిల్లి సువర్ణబాబు, ఆర్.శ్రీనివాసరెడ్డి, మాదాల శివన్నారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాప్రణతి, ఎమ్మెల్యే కుమారుడు సత్యనారాయణ

లక్ష రూపాయలు సీజ్

కొల్లిపర: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ గురువారం రాత్రి మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తూములూరు గ్రామానికి చెందిన రావులశెట్టి శ్రీనివాసరావు వద్ద లక్షా తొమ్మిది వేల రూపాయలను గుర్తించి ప్రశ్నించగా అతని వద్ద సరైన ధ్రువపత్రాలు లేకపోవటంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆర్ రవీంద్ర రెడ్డి తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్న నగదును స్థానిక పోలీసు స్టేషన్ వారికి అప్పగించినట్లు తెలియజేశారు.

గురువు జీవితం అతి పవిత్రమైనది

ఫాదర్ దిలీప్ కుమార్

ప్రత్తిపాడు: గురువు జీవితం ఎంతో పవిత్రమైనదని పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్‌కుమార్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని పునీత శౌరివారి పుణ్యక్షేత్రంలో కథోలిక సభ గురువుల పండుగైన పవిత్ర గురువారం (పెద్ద బేస్తవారం)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత శౌరివారి పుణ్యక్షేత్రం ఫాదర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ కథోలిక సంఘంలో పనిచేస్తున్న క్రైస్తవ మత గురువులకు గుర్తుగా ఈరోజు పవిత్ర గురువారం పండుగ నిర్వహించామన్నారు. తోటివారిని, శత్రువులను సైతం ప్రేమించాలని కోరారు. ఏసు ప్రభువు తన మరణానికి ముందురోజు శిష్యులతో కలిసి కడరా భోజనం చేశారని విశ్వాసులకు గుర్తు చేశారు. అనంతరం విశ్వాసుల ప్రేమకు గుర్తుగా పన్నెండు మంది శిష్యుల పాదాలు కడిగారు. అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫాదర్ పవన్, మఠకన్యలు, విశ్వాసులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

కళాశాల విద్య గుంటూరు ప్రాంత సంచాలకులు పి.కళావతి

చేబ్రోలు: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కళాశాల విద్య గుంటూరు ప్రాంత సంచాలకులు పి.కళావతి పేర్కొన్నారు. చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కళావతి మాట్లాడుతూ టెక్నికల్ స్కిల్స్‌పై పట్టు సాధించిన వారికి ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విడదల శ్రీదేవి వార్షిక రిపోర్టును వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు, మెమెంటోలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇప్పటంలో తాగునీటి బోర్లు ఏర్పాటు

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ ఇప్పటంలో కార్పొరేషన్ అధికారులు రానున్న వేసవిలో నీటి ఎద్దడిని నివారించేందుకు గురువారం నూతన బోరు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో ఇప్పటం పంప్‌హౌస్‌లో ఉన్న తాగునీటి బోరులో భూగర్భ జలాలు తగ్గడంతో తాగునీరు సరఫరా కావడం లేదని ఆ బోరుస్థానంలో మరో రెండు కొత్తబోర్లను కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్నామని, రెండు మూడు రోజుల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. కొల్లిపర మండలం అన్నవరపులంక గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 14 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మెల్లెంపూడిలో తాడిచెట్టు ఎక్కి తాటాకులు కొడుతున్న ఒక వ్యవసాయ కూలీ పొరపాటు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటనపై తాడేపల్లి పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. ఎస్ఐ ప్రతాప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఇప్పటం గ్రామానికి చెందిన మోర్ల వెంకటేశ్వరరావు (45) కూలి పనులు చేసుకుంటూ భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లల్ని పోషిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మెల్లెంపూడిలో తాటాకులు నరికే పని ఉండడంతో ఉదయం 10 గంటలకు పనికి వెళ్లాడు. అరగంట తరువాత తండ్రి రామారావుకు వెంకటేశ్వరరావు చెట్టుమీద నుంచి పడి గాయాలు అయ్యాయని చెప్పడంతో తండ్రి సంఘటనా స్థలానికి వెళ్లాడని, అప్పటికే కుమారుడు వెంకటేశ్వరరావు చనిపోయి ఉన్నాడన్నారు. తాడిచెట్టు ఎక్కిన వెంకటేశ్వరరావు కరెంటు తీగలకు ఆనుకుని ఉన్న తాటాకులను కర్రతో తప్పించే ప్రయత్నం చేస్తుండగా చెట్టుకు కరెంటు సరఫరా అయ్యి ఈ ప్రమాదం జరిగిందని తండ్రి రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్ కుమార్ తెలిపారు.



మృతి చెందిన మోర్ల వెంకటేశ్వరరావు

హాస్టల్‌లో చోరీ

గుంటూరు ఈస్ట్: ప్రైవేటు హాస్టల్‌లో ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు చోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బ్రాడీపేట 6/9లోని మను బాలుర హాస్టల్‌లో బుధవారం రాత్రి వెనుక తలుపులు తెరిచి నిద్రించారు. గదిలోని రెండు ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. బాధితులు అశోక్, ప్రమోద్, కిరణ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.